కథా నిలయం
4657
శ్రీకాకుళం

# ఎవరీ ఎన్నారైలు? ఏమాకథ?

శ్రీ మదఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుండగు భగవంతుని సృష్టిని, శ్రేష్ఠంబగు నిఖ్ఛరత ఖండంబున నుత్తర భాగము నందు ఆర్యావర్తమను పుణ్యభూమి యొప్పుచుండు. అందు కల్హార కేదార కరవీర జాజి జపా పాటలీ కేతకినాగ పున్నాగ మల్లికామతల్లికా కుందకురువక కపిత్థ మందమందార చంపక చాంపేద్యాయనేక పుష్పరాజ విరాజితంబును, సాలరసాలతాల వృక్షశోభితంబును, చక్రవాక జల కుక్కుట కోకిలాద్యనేక పక్షికృతకోలాహల నివహంబును యోగ నిష్ఠా గరిష్ఠ హరిహర పూజా మరంద పానానందతుందిల హృదయారవింద మౌనివర్య దివ్యాశ్రమ విలసితంబగు నైమిశారణ్యంబు వెలయుచుండు.

అందనేక ధర్మశాస్త్ర పురాణేతిహాస్యంబుల జెప్పు పౌరాణికుండగు సూతుడు శౌనకాది మునుల కనేక శాస్త్రంబులు బోధించు చుండు. ఒకపరి తమ తపంబులు మాని, మహాత్ములగు ఆ మునిపుంగవులు సూతు నొద్దకు బోయి "ఓసూతా! ఈ సుదినమున సంస్కృత భరితమైన పదములు విడిచి, మాకు అచ్చతెనుగులో మీ పురాణము చెప్పినచో మానసోల్లాసము కలుగునని తోచుచున్నది" అని చెప్పగా సూతునకు ఆశ్చర్యముతో నోట మాటరాని పరిస్థితి ఏర్పడెను.

శౌనకుడు సూతుని సూటిగా చూచి, తెలుగులో ఇట్లనియె. "ఓ సూత మహాముని! చల్ల కోసంవచ్చి ముంత దాచటం మా దిగంబరమునుల వల్ల కాజాలదు. అందుకే మీరు మా భావాలను నిరసించకముందే అసలు విషయం చెప్పేస్తున్నాను. మీరు ఎన్నో యుగాల తరబడి మాకు సత్యనారాయణస్వామి వ్రతకథ, వినాయకుని వ్రతకథ, వరలక్ష్మి, అనంత, మథన ద్వాదశీ, కేదారేశ్వర, ఋషి పంచమీ, కుజ గౌరీ, గజ గౌరీ, సంకట చతుర్థీ, సూర్య చంద్ర రథ సప్తమీ మొదలైన వ్రతకథలను ఏమాత్రం విసుగూ విరామం

లేకుండా చెప్పినవే చెప్పి, చెప్పి, చెప్పి, చెప్పి మా అందరికీ తలనొప్పి తెప్పించారు"

శౌనకముని ఒక్కక్షణం చెప్పటం ఆపి, బాగా ఎత్తుగా పెరిగిన జడల జుట్టు క్రింది తన తలను రెండు చేతులతోనూ ఒకసారి ఒత్తుకున్నాడు, ఇంకా తలనొప్పిగా వుందని సూచిస్తూ.

సూతుడా మునుల మనసులోని బాధని అర్థం చేసుకుని, ఒక చిరునవ్వు నవ్వి "శౌనకమహాముని! నా భాషా పురాణం మీకు విసుగు కలిగిస్తున్నాయని నోటితో చెబితే చాలు. అలా తలపట్టుకుని మీ నటనతో జీవించి మరీ చూపించనవసరంలేదు" అన్నాడు.

అందుకు శౌనక మహాముని కొంచెం సిగ్గుపడి, తన సిగ్గును బారుగా పెరిగిన తెల్లగడ్డంలో దాచుకుంటూ "సూత మహాముని! నీ దివ్యదృష్టితో మా బాధనర్థం చేసుకున్నందుకు చాల సంతోషం. ఈనాడు భరతఖండంలోని చాల దేవాలయాలలో పురాణాలు చెప్పటం మానేసి, ఆడియో కాసెట్లు అనబడే నూతన ప్రక్రియతో పండుగా పబ్బం గడిపేస్తున్నారు. ఆంధ్రా, తెలంగాణా, రాయలసీమ సీడెడ్ మొదలైన చోట్ల జిల్లాలవారిగా అన్ని ముఖ్యకేంద్రాలలోనూ సినిమా అనే సాధనం ద్వారానూ, ఇళ్ళల్లో కూడా టీవీ అనే ఒక ఆధునికయంత్రం ద్వారానూ పురాణాలను ఆటలతో పాటలతో శృంగారంతో రంగరించి, పంచరంగులలో సినిమా స్కోపులలో చూపించి ప్రజలలో భక్తీ, రక్తీ, ముక్తీ కలిగిస్తున్నారు. అందరూ మారుతున్న ఈ కలియుగంలో, మనమింకా మారకపోవటం సవ్యం కాదనిపిస్తున్నది. అందుకని కొన్ని నెలల పాటు, మనం ఎన్నాళ్ళనించో తరతరాలుగా చెప్పుకుంటున్న ఈ పుక్కిటి పురాణాలను మానేసి, వేరేఏవయినా కొత్త కథలను చెప్పుకుందాం! మీకభ్యంతరం లేకపోతేనే సుమా!" అన్నాడు లౌక్యం ఉపయోగించి.

ఆ మాటలు విన్న సూతమహర్షి, చేతిలోని దండాన్ని కళ్ళ ముందు వుంచుకుని ఒక్కక్షణం దీక్షగా ధ్యాన్నించి "అవును. ఆ భూప్రపంచంలో ప్రతిరోజూ ఎన్నో కొత్తకథలు జరుగుతున్నాయి. ఆ కథలను కొన్నింటిని చెప్పుకుంటే బాగుంటుందని మన మిత్రుడు శౌనకుడు చెప్పిన దానిని నేనున్నూ బలపరుస్తున్నాను. అంతేకాక మన ఈ కథలు వ్రాస్తున్న రచయితను కూడా విశ్వనాథ సత్యన్నారాయణగారి మందపాటి తెలుగులో కాకుండా ఇకనించీ కొంచెం సరళమైన తెలుగులో వ్రాయమని ఆజ్ఞాపిస్తున్నాను" అన్నాడు.

ఆయన మాటలకు శౌనకాది మునులందరూ సంతోషించి, కథలు వినటానికి సర్దుకు కూర్చున్నారు.

అప్పటిదాకా మౌనంగావున్న శుకమహర్షి తన నోరువిప్పాడు. తన తపోబలంతో ప్రకృతికీ, ప్రకృతిలోని సర్వ జంతుజాలానికీ, స్పందన నిచ్చిన మహాఋషి కనుక

ఆయన నోరు విప్పగానే మలయమారుతం చల్లగా వీచి వాతావరణాన్ని ఆహ్లాద పరిచిం ది. సర్వజంతుజాలమూ ఆయన వెనుక తలలు వూపుతూ ఆయన మాటలు వినటానికి సిద్ధంగా కూర్చున్నాయి.

"భారతదేశంలోని తెలుగుదేశం కబుర్లు అక్కడి ఎన్నో పత్రికలు సరసమైన ధర లకు కాకపోయినా, సరసమైన కథల రూపంలో పాఠకులకు వారం వారం అందిస్తూనే వున్నాయి. అందుకని ఆ కథలను మళ్ళీ మనం చెప్పుకోవలసిన అవసరం అంతగా లేదు. తెలుగువారు విదేశాలకు వలసపోయి, అక్కడ జీవిస్తున్న విధానాన్నీ, వాళ్ళ కష్టాలనీ సుఖాలనీ మనం చెప్పుకుందాం! పదిమందికీ చెబుదాం!" అన్నాడు.

శౌనకుడు దురదపెడుతున్న తనగడ్డాన్ని కుడిచేత్తో నిమురుకుంటూ "అంటే మీరు చెప్పేవి ఎన్నారై కథలన్నమాట" అన్నాడు.

శుకమహర్షి ఒకసారి కళ్ళు మూసుకుని, దివ్యదృష్టితో ఎనభై లిప్తల కాలంలో భూప్రదక్షిణం చేసేసి ఇలా అన్నాడు. "నాకు అన్నాదురై, అన్నాశాలై, అన్నామలై మొదలైన వాళ్ళు కనిపిస్తున్నారు కానీ, ఎన్నారైలు ఎవరూ కనపడటం లేదు"

సూతమహాముని వస్తున్న నవ్వుని మీసాలమధ్య దాచేసి ఇలా అన్నాడు "మునీ శ్వరా! తమకు ఆధ్యాత్మిక జ్ఞానమయితే వున్నది కాని, ప్రాపంచిక జ్ఞానం కొంచెం లోపించినట్టు అనిపిస్తున్నది. అన్నాదురై, అన్నామలై అన్నవి తమిళనాడులోని మనుష్యుల పేర్లు. అన్నాదురై స్మృతి చిహ్నంగా చెన్నైలోని మౌంట్ రోడ్డుకు పెట్టిన పేరు అన్నాశాలై. ఆ పేర్లుకలవారికీ ఈ ఎన్నారైలకు ఏమాత్రం సంబంధం లేదు. అలాగే ఈ ఎన్నారైలు భారత రైల్వేశాఖలో పనిచేసే ఉద్యోగస్తులుకూడా కాదు. ఎన్నారైలు అనగా నాన్ రెసిడెంట్ ఇండియన్స్. అంటే భారతదేశం నించి అమెరికా, ఇంగ్లండు, కెనడా, జపాను, జర్మనీలాంటి విదేశాలకు వెళ్ళి అక్కడ నివసిస్తున్న భారతీయులు"

శుకమహర్షి వెనుకనే కూర్చున్న ఆ ఎర్రకోతికేమీ అర్థమయినట్టు లేదు. కళ్ళు చిట్లించి పక్కనేవున్న చిన్న మునివేపు వింతగా చూసింది. అదిచూసి చిన్న ముని ముసిముసిగా నవ్వుతూ కొంచెం ముందుకు జరిగి కూర్చుని, చెవుల మీద జుట్టుని వెనక్కు తోసి చెవులు రిక్కించి అడిగాడు "అసలెవరీ ఎన్నారైలు? ఏమాకథ?" అని.

సూతుడు తలపంకించి కళ్ళుమూసుకుని ఆలోచనలో పడ్డాడు. అతని నిశ్శబ్దాన్ని భంగం చేయటమెందుకని చిన్న ముని క్రమశిక్షణతో ఒకేవరుసలో పాకుతున్న చీమల బారుని చూస్తూ కూర్చున్నాడు.

సూతుడు కళ్ళు తెరిచి అందర్నీ ఒక్కసారి చూసి శౌనకాది మునులతో ఇట్లా అన్నాడు. "ఈ ఎన్నారైలు ఎన్నితరాలుగా భారతదేశంవదిలి మిగతా దేశాలకు వెళ్ళా

రో చెప్పటం కష్టం. కొన్ని వందల సంవత్సరాల క్రితమే అటు మలైసియా, మారిషస్, శ్రీ లంక, బర్మా, ఫిజి, ఇండోనీషియా, హాంకాంగ్ మొదలైన దేశాలకు, ఇటు ఉగాండా, దక్షిణాఫ్రికా, కెన్యా, నైజీరియా, ఇథియోపియా మొదలైన దేశాలకేకాక, కొన్ని అరబ్ దేశాలకు కూడా వెళ్ళినట్టు దాఖలాలున్నాయి. తరువాత, అంటే ఇరవయ్యో శతాబ్దం లో, అటు ఆస్ట్రేలియా జపాన్ సింగపూర్‌లకు, ఇటు యూరప్‌లోని చాలదేశాలకు, కెనా డా అమెరికాలకు ఎక్కువమంది వెడుతున్నట్టు తెలుస్తున్నది"

చిన్నముని తన పంచెమీద మెల్లగా పాకుతున్న పెద్ద చీమను జీవహింస పాపం కనుక, సుతారాంగా చేత్తో తీసి సుతిమెత్తగా కింద పెట్టి అడిగాడు. "మరి తమ మాతృ భూమిని వదిలేసి ఈ జనాభాఅంతా విదేశాలకు ఎందుకు వెడుతున్నట్టు? ఏం బావుకుం టున్నట్టు?" అని.

సూతుడు చిన్నగానే అయినా, గడ్డంలో నించి అందరికీ కనపడేటట్టుగా చిరు మందహాసం చేసి శౌనకాది మునులతో ఇట్లా అన్నాడు.

"వాళ్ళల్లో అందరూ మాతృభూమి మీద ప్రేమ లేకుండా అలా వదిలేసివెళ్ళార నటం భావ్యం కాదు చిన్నమునీ. ఆ రోజుల్లో రకరకాల కారణాల వల్ల కొందరు వలస వెళ్ళితే, ఈ రోజుల్లో కొందరు పై చదువుల కోసం, కొందరు వ్యాపార కారణాల వల్ల, మరి కొందరు సాంకేతికరంగంలో సరికొత్త ప్రయోగాలకు వాళ్ళకి చక్కని అవకాశాలు దొరకటం వల్ల, ఇలా రకరకాల కారణాల వల్ల విదేశాలకు వెడుతున్నారు. అంతేకాక ఇలా వెళ్ళిన చాలమంది ఎన్నారైలు, తమ మాతృభూమిని మరచిపోకుండా భారతదేశం లో కష్టార్జితమైన తమ స్వంత డబ్బును వెచ్చించి రకరకాల పరిశ్రమలు, వ్యాపారాలు ప్రారంభించి సాంకేతికంగా యధాశక్తి భారతదేశాభివృద్ధికి దోహదం చేస్తున్నారు. భార తదేశపు ఆర్థిక ప్రగతికి డాలర్లతో అభిషేకం చేస్తున్నారు"

చిన్నమునికి ఆ జవాబు అంతగా రుచించినట్టు లేదు.

"అంతా కలికాల మహిమ" అన్నాడు.

జడలుగా చుట్టుకుని వున్న జుట్టు సూతుడి చెవులమీద కప్పబడి వుండటంతో, ఆయనకీ మాటలు సరిగ్గా వినబడినట్టు లేదు.

"అవును. నువ్వన్నట్టుగానే ఇది ఆరోకలికాల మహిమ!" అన్నాడు.

చిన్నముని కొంచెం పెద్దగా అన్నాడు "నేనన్నది కలికాల మహిమ అని. ఆరో కలికాలం ఏమిటి మధ్యలో.. " అతనికి అదేమిటో అర్ధమయినట్టులేదు.

సూతుడతని అజ్ఞానానికి నవ్వాడు. "నేన్నదానిలో తప్పేమీ లేదు నాయనా! కలికాలంలోనే ఈ మధ్య ఆరోకల్ అనే ఒక సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాం వచ్చింది. దానిని వ్రాయ

టంలోనూ, వాడటంలోనూ భారతీయులు గొప్పనిపుణులు. అద్వితీయులు. అందుకని వారిని దేశ విదేశాలలోని పారిశ్రామికులు గుర్తించి, తగిన ఉద్యోగాలనిచ్చి, పచ్చ కార్డుల తోరణాలతో ఆహ్వానిస్తున్నారు. అప్పటినించీ ఈ ఆరోకలికాలం మొదలయింది" అన్నాడు.

చిన్నముని ఒకసారి చిన్నగా తల ఆడించి పక్కనే వున్న ఎర్రకోతిని నీ కర్థమవ లేదా, నా కర్థమయిందిలే అన్నట్టుగా చూస్తూ, "ఓహో!"అన్నాడు.

శుకమహర్షి "మరి ఈ అన్నాదుర్రైలందరూ ఆరోకిల్.." అనబోతుండగా శౌనకుడు అతన్ని సరిదిద్దాడు "ష్! అన్నాదుర్రైలు కాదు... ఎన్నారైలు.." అని.

"అదే ఎన్నారైలు.." అన్నాడు శుకమహర్షి తన చిలుకముక్కును చిరాకుగా చిటపటపలాడించి.

సూతుడు ఈసారి నవ్వకుండా అన్నాడు. "నేను ఆరోకలికాల మన్నానని విదేశాలకి వెళ్ళే వాళ్ళందరూ ఆరోకిల్ విద్వాంసులే కానఖ్ఖర్లేదు. కొందరు చాలకాలం క్రితమే అమెరికాలాటి దేశాలకు వెళ్ళి, కలకాలం అక్కడే వుండిపోవాలని నిర్ణయించుకుని అక్కడే వుండిపోయారు. మరి కొందరు విదేశాల్లోవుండి, రోజూ భారతదేశం వెళ్ళిపోవాలనుకుంటూ వెళ్ళలేక, సతమత పడుతూ అక్కడే వుండిపోయేవాళ్ళు..."

"అంటే మన త్రిశంకుస్వర్గంలోలాగా అన్నమాట" ఆయన మాటలకడ్డంవస్తూ అన్నాడు చిన్నముని.

"ష్!" అన్నాడు శౌనకుడు, అతన్నినోరు మూసుకోమని అర్థం వచ్చేటట్టుగా.

"కొంతమంది చదువుకోటానికి విదేశాలకు వెళ్ళి, మంచి డిగ్రీలు సంపాదించుకునేవాళ్ళు. వాళ్ళల్లో కొంతమంది చదువయిపోగానే, ఇండియాకి వెళ్ళిపోదామనుకునే వాళ్ళు. కొందరు విదేశాల్లోనే వుండిపోవటం కోసం ఎన్ని కష్టాలైనా నష్టాలైనా భరించి అక్కడే వుండిపోయే వాళ్ళు. తరువాత ఇందాక మనం అనుకున్న సాఫ్టవేర్ ఇంజనీర్లు కొత్త తరం వలస వీరులు"

"మీరు ఇందాక చాలసార్లూ, ఇప్పుడు మళ్ళీనూ కొన్ని విదేశీ.... అవే ఆంగ్ల పదాలు వాడారు" అన్నాడు చిన్నముని కాలిమీద కుడుతున్న చిన్నచీమను చటుక్కున ఎవరూ చూడకుండా చేత్తో నలిపేసి.

శౌనకుడు జవాబు చెప్పాడు. "మనం విదేశీ కథలు చెప్పుకునేటప్పుడు, విదేశీ పదాలు వాడటంలో తప్పులేదు నాయనా!" అని.

"అతని మాటలకేంగానీ మీరు ఈ ఎన్నారై కథలని, మా అందరికీ అర్థమయేటట్టుగా కొత్త విషయాలు తెలుపుతూ, సరదాగా నవ్వుకునేటట్టు కాస్త హాస్యం జోడించి,

మాకు చెప్పిమమ్మల్ని మిక్కలి ఆనందింపచేయవలసిందిగా కోరుతున్నాను" అన్నాడు శుకమహర్షి, మాయాబజార్ సినిమాలో మిక్కిలినేనిలా గడ్డం నిమురుకుంటూ.

ఆయన ఆ మాట అనగానే, చుట్టుపక్కల వున్న చెట్లన్నీ అవునన్నట్టుగా తలలు వూపాయి. చెట్టు మీద కోకిల గొంతెత్తి పాడింది.

"ఆనందించటం ఒకటేనా.... లేక సత్యనారాయణస్వామి వ్రత కథ వినువారూ, పఠించినవారూసకలపాప విముక్తులై ఇహలోకంబున సర్వసుఖములననుభవించి అంతంబున పరమ పదము నొందుదురు కదా. అటులనే ఈ ఎన్నారై కథలు చదివినవారు కూడా.... " అని ఏదో అనుమానం వచ్చి చెప్పటం ఆపాడు చిన్నముని.

శౌనకుడికి ఆ మాటలకు కోపం వచ్చింది. దురదపెడుతున్న గడ్డాన్ని ఒకసారి బరబరా గోక్కుని "అదేమీకాదు. ఈ కథలు చదివినవాళ్ళకు ఆ దేశాల గురించీ అక్కడి భారతీయుల జీవన విధానాన్ని గురించీ తెలుస్తుంది. ఆ అవగాహన రావటం కూడా అవసరం. ఎందుకంటే తర్వాత ఆ విదేశాలకు వెడదామనుకునే వాళ్ళకు మన ఎన్నారై కథలలోని ఈ భోగట్టా ఉపయోగపడే అవకాశముంటుంది కదా.." అన్నాడు.

"లెస్సగా పలికావు శౌనకా! మనం ఈ రోజునించీ ఎన్నారై కథలను, చెప్పిన కథ చెప్పకుండా చెప్పుకుందాం" అన్నాడు శుకమహర్షి.

"అలాగే! కానీ ఇప్పుడు చీకటి పడుతున్నది. పురుగూ, పుట్రా వాహ్యాళికి బయల్దేరే సమయం. ఈ ఎన్నారై కథలు మనం రేపటినించీ చెప్పుకుందాం!"అన్నాడు సూత మహాముని లేచి నుంచుని.

మునులందరూ లేచి నుంచుని, ఆయనకి భక్తితో నమస్కారం చేసి, స్నానాదికాల కోసం పక్కనే వున్న నది వేపు నడిచారు.

ఆకాశంలో సూర్యుడు కాషాయవస్త్రాలను కట్టుకుని పడమటింటికి ప్రయాణం కడుతున్నాడు.